


వెంకటేశం! మనవాళ్ళు వట్టి వెధవాయిలోయ్! అందుకనే మనవాడు ప్రతివాడూ ప్రతి రెండవవాడినీ వెధవాయ అంటాడు. అది మనకు ఉగ్గుపాలతో పెట్టిన విద్దె. ఎదుటపడి ఆమాటనిందికి దమ్ముల్చాలగపోతే ఏదోగుట్టుగా సంధ్యావందనం చెప్పుకున్నట్టు లోపలనే అనుకుంటాడు. కాకపోతే—నక్కపుట్టి మూడాదివారాలు కాలేదన్నట్లు ఆ సత్రకాయగాడు సత్యజిత్రాయి ఏంవంత పాడిచేశాడని వాడికలా ఒఖ్ఖలాగ బ్రహ్మరథం పట్టిస్తున్నారూ అని. వాడు పేల్చినట్టి ప్రజ్ఞ, వాడు వెలిగించిన బ్రహ్మవిద్దె

యేఁవిటీ అని. ముందూ వెనకా పెద్దంత్రం చిన్నంత్రం లేకుండా అడ్డఁవైనవాడూ ఎగబడి వాణ్ణి తెగపొగిడెయ్యడమే. ఆపాటి ప్రతాపం ఈపట్టిన గొడ్డుపోయిందా.

మాస్టరుగారు ప్లేటు ఫిరాయిస్తున్నారనుకోకు. ఇంటర్నేషనల్ సబ్జెక్టుమీద లెక్చరిచ్చినపుడు బంగాళీవాడు పొడిచేసేదేమీఁ ఉండరాదు. దేశవాళీ జనాభా గురించి మాట్లాడినపుడే బంగాళీవాడి ప్రజ్ఞను మెచ్చుకు మనం అక్షింతలేసుకోవాలి. తప్ప ఇందులోమటుకు అందరం సగోత్రీకులమేఁ. అంతేతప్ప ఈ సత్యాజిత్రాయంటే నాకు పగనుకునేవు — నాకంతా సమానమేఁ. ఏరాయైతేం తల బద్దలగొట్టుకోడాని కన్నారు.

ఇంతకీ చెప్పొచ్చిన ముక్క — ఆ పథేర్ పాంచాలీని వాడు తీశాడు: నేను తియ్యలేదు అంతేగదా తేడా ఇలా బాజాలు వాయించి పొద్దస్తమానం ఎవార్డులు గుప్పిస్తారని వాగ్దానమిస్తే నేను తెల్లవారేసరికల్లా అరడజను కళాఖండాల్లాగవతల పడేస్తాను.

అసలు కళాఖండాలనగా ఏమిటోయ్ — డబ్బురాని పిక్చర్లు ... అంతేకదా. అసలే డబ్బు గిట్టక నెత్తిన చెంగేసుకుపోయేవాడి బోడిగుండుమీదికి మల్లెచెండులా ఈ పేరు తగిలిస్తారు — మరెప్పుడూ ఇలాటి ఓఘాయిత్యప్పన్లు చెయ్యకుమీ అని సున్నితంగా మందలించి, వాడూ నా మాట దొరకబుచ్చుకునే మాట్లాడుతున్నాడనుకో. 'మా యింట నాలిగ్గీసుకునే తాటాకుబద్దలు నింపుకున్నరోజున మళ్ళా ఈ సర్కారువాళ్ళు సర్టిఫికెట్టుకోసం కళాఖండవోఁటి

తీస్తానని. అలాగ్గాదు బాబ్బాబు నువ్వు తీసితీరాలి మేం చూసితీరాలి అని కాళ్ళావేళ్ళాబడితే, తేడబ్బు అని డబాయించొచ్చు.

నేను హాలిడేమీద ఇక్కడికొచ్చేముందేగదోయ్ - ఓ కళాఖండం చూసొచ్చాం. నాయుడుగారు తీయించారు. ఎలావుంది గిరీశంగారు. డబ్బులేవైనా వొచ్చేనా అన్నాడాయన బిక్కమొహం వేఁసి. నువ్వులేమన్నా జాగర్జేశారా స్వావీఁ అన్నా. అంతేనా అన్నాడు కుప్పకూలిపోయి. అంతగాక మరేవిఁటయ్యా. ఇలా మాస్టరుపీసు తియ్యాదల్చుకున్నట్టు ఓముక్క నాచెవిన పారేస్తే కక్కుర్తిరకంగాకుండా కడితేరా కళాఖండవేఁ తీసిపడేసిపెడుదును గదయ్యా అన్నాను. మరేందారి బాబూ అని ఇదయ్యాడు పాపం.

సరే ఇప్పుడైనా మించిపోయిందేవీఁ లేదూ, ఈ పిక్చర్లో డాన్సులూ, కామిక్కు వగైరా డబ్బు వాసనేసే వన్నీ తీసిపారేసి ప్రిస్టేజీపిక్చరని పబ్లిసిటీ అఘోరించవయ్యా లేపోతే నెక్స్టట్ పిక్చరుకి డిస్ట్రిబ్యూటర్రాడు అని ఓ చిటకా చెప్పానన్నమాట. పాపం వెర్రిముండావాడు చచ్చి నా కడుపున పుడతానన్నాడు. దీంతరవాద్ది ఈ లాగేసిన భాగాలన్నీ పోగేసి మాస్పిక్చరు తీసిపెడితే మరిహ నేనీజన్మకి చెప్పులు కుట్టించుకోనక్లేదనిన్నీ, తనే చర్మం కోసి కుట్టించి మరీ దాఖలు చేసుకుంటాననిన్నీ మొరపెట్టుకున్నాడు. వాడు మాటిచ్చాడని మనం జోళ్లు కొనుక్కోడం మానేస్తే యెలాగ. ఇస్తేగిస్తే రెండుజతలు పడుంటాయి

కాబట్టి నువ్వు ఓ కొత్తజోడు—ఫస్టుక్లాసు విలేజ్ మేక్ గురుదక్షిణగా అర్పించుకుందికి సన్నాహాలారంభించవచ్చు. నేను యెంతమాత్రం అడ్డుపడను.

వెంకటేశం, కొంచెం విసింటూ జరుగు ఓ కబురు చెబుతా... చూడు, నేను వెనక్కితిరిగిజూస్తే బావుండదు గాని, ఈపక్కన మండపమ్మీద కూచుని మన కబుర్లాలకిస్తున్న చౌదరిగారు ఇంకా అక్కడే ఉన్నాడా లేచి వెళ్ళి పోయాడా... ఆ - మరేంలేదు, పట్నంలో ఓ బైస్కోపు కంపినీలో ఆయన పావలా వాటా పెడుతున్నాడని విన్నానంలే. నాలాటివా డిక్కడున్నాడని పోల్చుగోలేక, మళ్లా డైరెక్టరుకోసం వెతుక్కుని డబ్బు తగలేసుకుంటా డన్న జాలికొద్దీ - నేను బొత్తిగా నివురుగప్పిన నిప్పులాటివాణ్ణయి పోతున్నానుగదోయ్. వెధవది అదేచిక్కు.. మోడెస్టీ మహలావు. ఆ మాట వాళ్లు పోల్చుకోవాలి. కోటి నదులు ధనుష్కోటిలో నుండగ అన్నాడు త్యాగరాజువారు. అదే గమ్మత్తు. ఒళ్లో బిడ్డణ్ణెత్తుకుని ఊరంతా వెతికినట్టు నేనిక్కడే వుండగా చౌదరిగారు డైరెక్టర్లకోసం వెతకడం ఏవిఁఘనం గనక-తరవాతాయన నాలిక్కరుచుకోలేక ఇదవాలిగదా.

★